క్లుప్తంగా

అన్న ప్రసాదం వితరణకు వసతి కల్పించండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): బ్రహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి ఆధ్వర్యంలో నడుస్తున్న నారాయణ అన్న ప్రసాదం వితరణకు అనువుగా ఎక్కడైనా వసతిని కల్పించాలని ఆ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ కలెక్టర్ పి.కోటేశ్వరరావును కోరారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి ఏబీసీ క్వార్టర్లలోని ప్రభుత్వ క్వార్టర్‌ను కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, ఎస్.రాజశేఖర్, శ్యామ్‌సుందర్ రావు, రాధాకృష్ణ, రాజేష్ తదితరులు ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు



డంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కర్నూలు(రాజ్‌విహార్): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. బుధవారం రాత్రి స్థానిక నగర శివారులోని సుంకేసుల రోడ్డు సంజీవని హాస్పిటల్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 23 మంది పట్టుబడటంతో వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం పేర్కొన్నారు.

85 శాతం పెన్షన్ల పంపిణీ



వికలాంగురాలు పింజరి అయేషాకు పెన్షన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ సుధాకర్

కర్నూలు(టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో మార్చి నెల 1వ తేదీ బుధవారం పెన్షన్ల పంపిణీ ప్రక్రియ చురుగ్గా సాగింది. 52 వార్డుల పరిధిలోని 136 సచివాలయాల పరిధిలో మొదటిరోజు 85.24 శాతం పెన్షన్ పంపిణీని వలంటీర్లు పూర్తి చేశారు. నగరంలో పెన్షన్‌దారులు 32,642 మంది ఉండగా 27,824 మందికి రూ.7,82,94,750 పంపిణీ చేసినట్లు నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ వెల్లడించారు. ప్రతినెలా రూ.9,19,17,250 పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఐదుగురు పోలీసులకు స్థాన చలనం

కర్నూలు(రాజ్‌విహార్): జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఐదుగురు కానిస్టేబుళ్లకు స్థాన చలనం కలిగింది. బుధవారం రాత్రి జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు ఉండగా ఇద్దరు మహిళ కానిస్టేబుళ్లు ఉన్నారు.

అడిగిన వారందరికీ పనులు కల్పిస్తాం

- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

కల్లూరు: జాతీయ మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద అడిగిన వారందరికీ పనులు కల్పిస్తామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు అధికారి(పీడీ) అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చెట్లమలాపురం గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనిచేస్తే పూర్తి వేతనం లభిస్తుందన్నారు. ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ఉదయం త్వరగా వచ్చి పనులు ముగించుకుని త్వరగా వెళ్లాలని కూలీలకు సూచించారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : పఠాన్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, సార్, వినరో భాగ్యము విష్ణు కథ, సెల్ఫీ
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : వీరసింహారెడ్డి, అమిగోస్, కోనసీమ థగ్స్, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేరు వీరయ్య, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, రైటర్ పద్మభూషణ్, అవతార్ ది వే ఆఫ్ వాటర్, సెల్ఫీ, మిరపకాయ్, క్రౌన్ బీర్
భరత్ కాంప్లెక్స్ : మిరపకాయ్
రాజ్ : మిస్టర్ కింగ్
శ్రీరామ : డెడ్‌లైన్ **విజయ** : సార్

ఆరోగ్యం చల్లకుండ

- పేదోడి ఫ్రిజ్‌కు పెరిగిన డిమాండ్
- మట్టి కుండల్లోని నీటితో అనేక ప్రయోజనాలు
- మార్కెట్లో అభిరుచులకు అనుగుణంగా రంగు రంగుల మట్టి పాత్రలు, కుండలు



పెద్ద మార్కెట్ వద్ద మట్టి కుండలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): ఓల్డ్ ఈజ్ గోల్డ్ అన్నట్లు.. మళ్లీ ఎక్కువ మంది మట్టి కుండలు, మట్టి ప్రాతల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో పేదోడి ఫ్రిజ్‌కు డిమాండ్ పెరిగింది. ఒకప్పుడు మన జీవితాలతో మమేకమైన మట్టి పాత్రలు, కుండలు.. మారిన జీవన శైలీతో స్టీల్, ప్లాస్టిక్, పింగాణి ప్రాతలు రావడంతో వాటి వాడకం పూర్తిగా తగ్గింది. మట్టి కుండలోని నీరు తాగడం, మట్టి పాత్రలలో చేసిన ఆహారం తినడం వల్ల అనేక ప్రయోజనాలు చేకూరుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల కాలంలో ధనవంతులు కూడా మట్టి కుండలోని నీటిని తాగడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుతం అభిరుచులకు అనుగుణంగా రంగు రంగుల్లో మట్టి కూజాలు, కుండలు, పాత్రలు, గ్లాసులు, జగ్గులు మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి.

దాహార్తి తీరి ఎంతో ఊరట

మట్టి కుండలకు సహజ సిద్ధంగా మంచినీటిని చల్లబరిచే గుణముంది. ఫ్రిజ్‌లోని చల్లని నీరు తాగడం వల్ల గొంతు నొప్పి, శ్వాసకోస వ్యాధులు వస్తాయి. అయితే కుండలోని నీరు శ్రేష్టమైనది. ఆ నీటిని తాగడం వల్ల ఆరోగ్యానికి మంచిది. పైగా ఎటువంటి రోగాలు రావు. మండుటెండలో తిరిగి అలసటగా ఇంటికి చేరుకున్నప్పుడు ఓ గ్లాసు మట్టి కుండలోని నీరు తాగితే దాహార్తి తీరి ఎంతో ఊరట లభిస్తుంది. ఆనీటిలో ఎటువంటి హానికర రసాయనాలు ఉండవు. దీంతో కడుపులో మంట, ఇతర జీర్ణ సమస్యలు తగ్గుతాయి. అతిగా దాహం వేయదు. వడదెబ్బ రిస్క్ కూడా తగ్గుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. మట్టి పాత్రలో చేసిన ఆహారం రుచిగా ఉంటుంది.



ఆహారపదార్థాలలో పోషకాలు వృథా కావు. ఆహారంలో యాసిడ్ మట్టి పత్రాలోని ఆల్కలైన్‌తో చర్యకు గురై పీహెచ్ స్థాయిలు తటస్థీకరిస్తుంది. మట్టి పాత్రలలో చేసిన ఆహారం అన్ని రకాలుగా ఆరోగ్యదాయకం. ప్రస్తుతం కర్నూలు నగరంలో మట్టి కుండలు, పాత్రలకు గిరాకీ పెరిగింది. పత్తికొండ, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్ కడప, జడ్చర్ల, రాజస్థాన్, తమిళనాడులో తయారు చేసిన మట్టి కుండలు, వాటర్‌ఫిల్టర్‌లు, నీళ్ల బాటిళ్లు, టీ కప్పులు, కూజాలు, దీపాలు, తులసికోట, బిర్యాని కుండలు, పెరుగు కుండలు, హండీలు సైజును బట్టి రూ.200 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు.



రాజస్తాన్ కుండలు



అమ్మకానికి ఉంచిన కూజాలు, మట్టి పాత్రలు

30 ఏళ్ల నుంచి వ్యాపారం



30 ఏళ్ల నుంచి కుండలు,మట్టిపాత్రలను జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసు కుని విక్రయిస్తున్నాం. వేసవికాలంలో మట్టికుండలకు బాగా డిమాండ్ ఉంటుంది. మట్టికుండల సైజులను బట్టి రూ.200 నుంచి 1200 దాకా విక్రయిస్తాం. పాతకాలంలో మాదిరిగానే చాలా మంది మట్టికుండల్లో వంటలు చేసుకుని తినడానికి ఇష్టపడుతున్నారు. –కె వెంకటేశ్వరమ్మ, చిరు వ్యాపారి, కర్నూలు

మట్టి కుండలతో జీవనం



కులవృత్తిని నమ్ముకుని మట్టికుండలు, పాత్రలను విక్రయిస్తున్నాం. వేసవి కాలంలో 20 నుంచి 50 కుండల వరకు విక్రయిస్తాం. మట్టి కుండలతో పాటు మట్టి వాటర్ బాటిల్స్, టీ కప్పులు, వాటర్ ఫిల్టర్స్‌ను సైజును బట్టి అమ్ముతున్నాం. మట్టి కుండలు కొనుగోలు చేయడానికి చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. –కె.పద్మావతి, కర్నూలు

మట్టి కుండల్లోని నీరే శ్రేష్టం



మారుతున్న కాలానికి అనుగుణంగా ఎన్ని రకాల ఫ్రిజ్‌లు, వాటర్ ఫిల్టర్లు వచ్చినా మట్టి కుండలోని నీటికి సాటిరావు. వేసవిలోనే కాక అన్ని కాలాల్లో మట్టి కుండల్లోని నీరు చాలా శ్రేష్టం. ఎండల్లో బయటికి వెళ్లి ఇంటికి వచ్చిన వెంటనే ఒక గ్లాసు మట్టి కుండలోని నీరు తాగితే ఎంతో హాయిగా ఉంటుంది. – ఎస్.మహేంద్రకుమార్, కర్నూలు

బాలికలు ఉన్నతస్థితికి చేరుకోవాలి



పదో తరగతి విద్యార్థినులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ డీజీఎం లేఖామీనన్

కర్నూలు(అగ్రికల్చర్): బాలికలు ప్రతి ఒక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పట్టుదల, క్రమశిక్షణతో చదవి ఉన్నతస్థితికి చేరుకోవాలని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ లేఖామీనన్ ఆకాంక్షించారు. బుధవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని బి.క్యాంపులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినులకు పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ డీజీఎం మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ శ్రద్ధగా చదవాలని, ఆర్థిక స్వేచ్ఛ పొందుటకు చదువులో రాణించడం అత్యవసరమని అన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని అందుకు అనుగుణంగా కష్టపడాలన్నారు. అదేవిధంగా విద్యార్థినులు నైతిక విలువలు, బ్యాంకింగ్ వ్యవహారాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎస్‌బీఐ అమలు చేస్తున్న రుణ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఏజీఎం(హెచ్‌ఎల్‌ఎస్‌టీ) కేఎస్‌ఆర్ మూర్తి, ఏజీఎం (ఎఫ్‌ఐ) శ్రీనివాస్, ఏజీఎం మురళీ నాయక్, చీఫ్ మేనేజర్ (హెఆర్)సీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి



మేయర్, పాలకపక్ష సభ్యులను కలిసిన స్థానిక సంస్థల శాసన మండలి అభ్యర్థి డాక్టర్ మధుసూదన్

కర్నూలు (టౌన్): స్థానిక నగరపాలకలోని మేయర్ చాంబర్‌లో నగర మేయర్ బీవై రామయ్యను బుధవారం సాయంత్రం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శాసన మండలి స్థానిక సంస్థల అభ్యర్థి డాక్టర్ మధుసూదన్ మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలి ఎన్నికల్లో తనకు పూర్తి సహకారం అందించాలని కోరారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. అందులో భాగంగానే ఒక బీసీ సామాజిక వర్గానికి చెందిన తనకు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చారన్నారు. ఈ ఎన్నికల్లో గెలుపు కోసం పూర్తి స్థాయిలో సహకారం అందించాలని విన్నవించారు. దీనిపై స్పందించిన మేయర్, కార్పొరేటర్లు తమ సహకారం తప్పకుండా ఉంటుందని హామీ ఇచ్చారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి





సమావేశంలో మున్సిపల్ అధికారులు, ఇంజినీర్లు, సచివాలయాల సిబ్బంది, పనితీరుపై సమీక్షిస్తున్న కమిషనర్

- రోజు వారీ ప్రగతి తెలియజేయండి
- నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవు
- రెవెన్యూ విభాగం పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్

కర్నూలు (టౌన్): నగర పాలక రెవెన్యూ విభాగం పనితీరుపై నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సీరియస్ అయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరం ఈనెలాఖరు నాటికి ముగుస్తుంది. సచివాలయాల వారీగా ఎంత డిమాండ్ ఉందో...తెలీదు.. ఎంత కలెక్షన్ చేశారో.. తెలీదు. ఇలాగుంటే ఎలా...అంటూ కమిషనర్ సచివాలయాల ఉద్యోగులపై మండి పడ్డారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలో ఉన్న నూతన నగరపాలక కౌన్సిల్ సమావేశంలో రెవెన్యూ విభాగం, ఇంజినీరింగ్ విభాగంపై కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరపాలక రెవెన్యూ విభాగం ప్రతి ఏడాది రూ.85 కోట్లు పన్నులు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 62 శాతం మాత్రమే వసూలు చేశారు. ఇప్పటికి రూ.33 కోట్ల 55 వేలు పన్నులు వసూలు చేయాల్సి ఉంది. నెలరోజుల గడువు ఉంది. ఎప్పుడు లోపు వసూలు చేస్తారంటూ ప్రశ్నించారు. పన్నుల వసూళ్లలో సచివాలయాల ఉద్యోగులు ఏం చేస్తున్నారన్నారని ప్రశ్నించారు. టీమ్‌లను ఏర్పాటు చేసుకొని స్పెషల్ డ్రైవ్‌లతో ప్రతి రోజు పన్నుల వసూళ్ల ప్రగతి వివరాలు తనకు తెలియజేయాలని ఆదేశించారు. సచివాలయాల ఉద్యోగులు, రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, టాప్ ఇన్‌స్పెక్టర్లు వంద శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా ఇంజినీరింగ్ విభాగం పనితీరుపై కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఅభివృద్ధి పనుల వేగం పెంచాలన్నారు. టెండర్ల ప్రక్రియ ముగిసిన తరువాత అగ్రిమెంటు, వర్క్ ఆర్డర్, పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు సుందరీకరణ పనులు, సెంట్రల్ మీడియన్స్, బ్యూటిఫికేషన్, ప్యాచ్ వర్కులు, గడప, గడపకు సమస్యలు తదితర వాటి గురించి కమిషనర్ చర్చించారు. ఆయా ఈఈ, డీఈలతో మాట్లాడారు. కార్యక్రమంలో నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మున్సిపల్ ఎస్ ఈ శేషాసాయి, రెవెన్యూ అధికారులు వీరస్వామి, జునీద్ పాల్గొన్నారు.

కబడ్డీ జట్టుకు అభినందన

కర్నూలు(టౌన్): గత నెల 26 నుంచి 28వ తేదీ వరకు చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ పోటీల్లో అండర్–14 బాలికల విభాగంలో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. దీంతో ఆ జట్టును స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య బుధవారం అభినందించారు.



5న అరుణాచల క్షేత్రంకు హైటెక్ బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): గిరి ప్రదక్షిణ దీపోత్సవం సందర్భంగా తమిళనాడులోని అరుణాచల క్షేత్రం దర్శనం కోసం ఈ నెల 5వ తేదీన నడిపే సూపర్ లగ్జరీ (హైటెక్) ప్రత్యేక బస్సు (సర్వీస్ నంబర్–93999)ను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు–2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు కర్నూలు నుంచి ఈ బస్సు బయలుదేరి, 6వ తేదీన తెల్లవారు జామున 4:30గంటలకు అరుణాచలానికి చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వర స్వామి దర్శనం, దీపోత్సవం అనంతరం అదే రోజు సాయంత్రం 4గంటలకు బస్సు బయలుదేరి, 7వ తేదీ ఉదయం 6 గంటలకు కర్నూలుకు చేరుకుంటుందని వెల్లడించారు. అరుణాచలం క్షేత్ర దర్శనం రాక, పోకల కోసం బస్సు చార్జీ రూ.2 వేలు ఉంటుందని, ఇందులో ముందస్తు టిక్కెట్లు తీసుకునేందుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. బస్టాండ్లు, ఏజెంట్లు, ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు పొందవచ్చని, వివరాలకు అసిస్టెంట్ మేనేజరు సెల్ 7382871131, 9959225794 (తన) నంబర్లకు, సమీపంలోని డిపో మేనేజర్లను సంప్రదించాలన్నారు.

5న 'ఆశావాది విబుధారాధన' ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: నవ్యాంధ్రుల రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో అవధానాచార్య పద్మశ్రీ ఆశావాది ప్రకాశరావు ప్రథమ వర్ధంతి సభను నిర్వహిస్తున్నట్లు నరసం కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి తెలిపారు. దీంతో పాటు ప్రముఖ బంధ కవి అన్నమరాజు ప్రభాకరరావు రచించిన 'ఆశావాది విబుధారాధన' గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందన్నారు.

'ఉపాధి' సద్వినియోగం చేసుకోవాలి

సి.బెళగల్: మండల ప్రజలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా ఏపీడీ అల్లిపీరా సూచించారు. బుధవారం సి.బెళగల్ పరిధిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడారు. కూలీలు దినసరి వేతనం రూ.257లు వచ్చేలా కొలతల ప్రకారం పనులు చేసుకోవాలన్నారు.

సేవలను విస్తరించండి

సి.బెళగల్: సేవలను మరింత విస్తరించాలని సి.బెళగల్ – 1 గ్రామ సచివాలయ నోడల్ అధికారి, పశు వైద్యుడు ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన స్థానిక సచివాలయం – 1ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి ఉద్యోగులకు కార్యాలయ నిర్వహణపై సూచనలు చేశారు. అక్కడ ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.

రైతులకు తోడ్పాటునందించాలి

- ఇన్‌పుట్ డీలర్లకు జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి సూచనలు



మాట్లాడుతున్న డీఏఓ పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే విధంగా సహకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో 2021–22లో దేశీ డిప్లొమా కోర్సు కింద 48 వారాలు శిక్షణ పొందిన ఇన్‌పుట్ డీలర్లకు సర్టిఫికెట్ల ప్రదానం చేసే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఏవో వరలక్ష్మి హాజరై 38 మంది ఇన్‌పుట్ డీలర్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయానికి సంబంధించి విత్తన శుద్ధి మొదలు, పంట కోత వరకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, క్వాలిటీ కంట్రోల్ తదితర వాటిపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు శిక్షణ ఇచ్చారని తెలిపారు. దేశీ శిక్షణలో నేర్చుకున్న వాటిని రైతులకు వివరించి వ్యవసాయంలో రాణించే విధంగా తోడ్పడాలని సూచించారు. రైతులు ప్రతి అవసరానికి మీ దగ్గరకే వస్తారని, వారికి చక్కటి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. దేశీ డిప్లొమా కోర్సు వల్ల ఇన్‌పుట్ డీలర్లకు వ్యవసాయంపై సమగ్రమైన అవగాహన ఏర్పడి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ డీపీడీ శ్రీలత, బనవాసి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ, ఏరువాక కేంద్రం సమన్వయకర్త ప్రసాద్‌బాబు, డీఆర్‌ఏ ఏడీఏ వెంకటేశ్వర్లు, దేశీ కోర్సు సమన్వయకర్త నాగేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో ముగ్గురికి అరుదైన శస్త్రచికిత్సలు



కోలుకున్న రోగులతో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జనరల్ సర్జరీ విభాగంలో ముగ్గురికి వైద్యులు అరుదైన శస్త్రచికిత్సలు నిర్వహించి ప్రాణం పోశారు. వివరాలను ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణనాయక్ తెలిపారు. అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం దీవెనపల్లి గ్రామానికి చెందిన కంబగిరి(60)కి గొంతు వద్ద థైరాయిడ్ కారణంగా గాయటర్(కణితి) ఏర్పడింది. సాధారణ పరిమాణం కంటే పెద్దగా ఉండటమే గాక రక్తనాళాలకు పెనవేసుకుని ఉండటంతో శస్త్రచికిత్స నిర్వహించి ఈ నెల 23న కణితిని తొలగించారు. అలాగే గుత్తికి చెందిన మెహ్రాజ్‌బీ(70) అనే వృద్ధురాలికి పాంక్రియాస్‌కు క్యాన్సర్ రావడంతో అరుదైన శస్త్రచికిత్స చేశారు. తెలంగాణా రాష్ట్రం గద్వాల జిల్లా ఐజకు చెందిన పుష్ప(30) పొరపాటున వక్కను మింగడంతో ఈ నెల 7న ఆసుపత్రిలో చేరింది. పేగులో ఇరుక్కున్న వక్కను ల్యాప్రోస్కోపి ద్వారా ఈ నెల 9న తొలగించారు. వీరు ముగ్గురు కోలుకోవడంతో బుధవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. శస్త్రచికిత్స నిర్వహించిన వారిలో తనతో పాటు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.సాబిరా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మన్సూర్‌బాషా, డాక్టర్ మధుసూదన్, సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ చైతన్యవాణి, పీజీలు ఉమేష్ చంద్ర, షాబాజ్ జహాన్, ప్రియాంక, శాంతి స్వరూప్, మమత, చిన్ని, సర్ఫరాజ్, శిరీష, సాయిచరణ్ పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు.

కుష్టు వ్యాధి కేసులను గుర్తించాలి



పట్టణ ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ఎల్.భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): పట్టణాల్లో కుష్టువ్యాధిగ్రస్తుల కేసులను గుర్తించి వారికి చికిత్స అందేటట్లు చూడాలని జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసి, టీబీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ చెప్పారు. బుధవారం ఆయన రోజావీధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి రికార్డులను పరిశీలించి సిబ్బందికి కుష్టుపై అవగాహన కల్పించారు. కుష్టువ్యాధి లక్షణాలు, అది సోకే విధానం, గుర్తించే విధానాన్ని పేర్కొంటూ ఇంటింటికి తిరిగి కేసులను గుర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫాతిమా, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శివశంకరరావు, డిప్యూటీ హెచ్‌ఈవో ఎస్.దేవప్రసాద్, డీపీఎంవో ఐజ గుల్ హక్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ



రంగనాథపెరుమాళ్



గోదాగోకులంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న పండితులు,



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారు మామిదాలపాడు సమీపంలోని శ్రీగోదా గోకులంలో దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శోభాయమానంగా జరిగింది. గత పది రోజులుగా జరుగుతున్న యాగాది క్రతువులతో బుధవారం శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆళ్వారాచార్యుల దేవతామూర్తుల ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పూజ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆగమ సార్వభౌమ శ్రీమద్వాధూల సముద్రాల రమకాంతాచార్య స్వామి ఆధ్వర్యంలో ఈ యజ్ఞం జరిగింది. వేడుకలో పాల్గొన్న కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్‌ను ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపక చైర్మన్ మారం నాగరాజగుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, వేద పండితులు శ్రీమన్నారాయణాచార్యులు, మాధవాచార్యులు, భగవాన్ ఆచార్యులు, రమేష్ ఆచార్యులు, రంగనాథాచార్యులు, కాండూరి శ్రీనాథ్, వంశీకృష్ణమాచార్యులతో పాటు అనేకమంది ఋత్విక్కులు పాల్గొన్నారు. గోదా గోకులంలో జరిగిన ప్రతిష్ఠాపన మహోత్సవానికి ప్రయాగ నుంచి ప్రపర్ణ రాఘవ జియర్ స్వామీజీ, భాగ్యనగర్ నుంచి వ్రత ధర శ్రీనివాస రామానుజ జీయర్ స్వామీజీ, గంగాపురం పీఠం నుంచి పరమాత్మానంద గిరి స్వామీజీ, కర్ణాటక రాష్ట్రం మేల్కోట నుంచి శఠగోప రామానుజ జీయర్ స్వామీజీతో పాటు వివిధ ప్రాంతాల పీఠాధిపతులు, విశ్వహిందూ పరిషత్ జాతీయ సహ కార్యదర్శి వై.రాఘవులు, జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, లలితా పీఠం మేడా సుబ్రహ్మణ్యం స్వామి, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ ముల్ల వెంకటరెడ్డితో పాటు వివిధ రంగాల ధార్మిక సంస్థల ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు గోకులంలో శ్రీరంగనాయకీ గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్ కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు.



గోదా రంగనాయకి